తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## తిరుమల లోయలో గుర్తుతెలియని వ్యక్తంటూ పుకార్లు

### -విజిలెన్స్,పోలీసు రెస్క్యూటీమ్ ఆపరేషన్



తిరుమల,మార్చి 5(ప్రభాతవార్త)ప్రతినిధి:

మొదటిఘాట్‌లో అక్కగార్ల గుడి వద్ద ఓ వ్యక్తి లోయలో దిగేశాడని సమాచారం బుధవారం హడలెత్తించింది. మధ్యాహ్నం ఈ సంఘటన జరిగిందని కొందరు భక్తులు చూసి టిటిడి విజిలెన్స్‌కు సమాచారం అందించారు. దీంతో తిరుమల ఏవిఎస్‌ఒ, తిరుమల 2టౌన్ సిఐ రాముడు,విజిలెన్స్ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది సుమారుగా పదిమందికి పైగా త్రాళ్ళతో అక్కగార్లగుడి ప్రాంతంలో వెదికారు.

## నయనానందకరం శంకరుని శయనోత్సవం

శ్రీకాళహస్తి,మార్చి 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో 13రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి శయనోత్సవంతో ముగిసాయి. ఈ ఉత్సవానికి స్థానిక భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం నుంచి భక్తుల సేవలందుకున్న స్వామి అమ్మవార్లకు ఈ ఉత్సవం ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నది. ఆలయంలో ఉమాదేవి సమేత చంద్రశేఖర్ స్వామి వెలసిన త్రిశూలానికి.స్వామి అమ్మవార్ల ఉత్సవర్లకు పూజలు నిర్వహించారు. అమ్మవారి గర్భగుడిలోని అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ప్రతిష్టించి స్వామి వారి గర్భగుడి వద్దకు తీసుకెళ్ళారు.అక్కడ స్వామి ఉత్సవ మూర్తిని ఉంచి ఉత్సవంగా పళ్ళియార వద్దకు తీసుకెళ్ళారు.ఈ ఉత్సవం సుమారు రెండు గంటల పాటు సాగింది. స్థానికంగా వివాహం అయిన తరువాత కొత్తజంటకు ఏర్పాటు చేసే శోభన ంకు తార్కాణంగా నిర్వహించే ఉత్సవం ఏకాంత సేవ.స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవం తరువాత నిర్వహించే సంప్రదాయం ఉత్సవం ఏకాంత సేవ. ఈ సేవకు అమ్మవారి గర్భగుడి సమీపంలో ఉన్న శయనమందిరాన్ని చక్కగా అలంకరించారు.ఈ శయనమందిరాన్ని చక్కగా పూలతో ముస్తాబు చేశారు.మందిరాన్ని సువాసనలు వెదజల్లే సుగంధాలు వివిధ రకాల పూల సొభగులతో శోభాయమానంగా తీర్చి దిద్దారు.ఇక్కడ శాస్త్రోక్తంగా పూజలు జరిపారు.విశేష హారతులిచ్చారు.వేదపండితులు వేదమంత్రాలను పఠిస్తుండగా ఆలయ ప్రధానార్చకులు డాక్టర్ స్వామినాథన్, సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, వరదా గురుకుల్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు.

**శయన మందిరం ప్రాధాన్యత:**

శ్రీకాళహస్తీశ్వరాలయం వెలసిన అమ్మవారు మహిమాన్వితురాలుగా చెబుతారు.ఇక్కడ అమ్మవారు పరమేశ్వరుని గురించి తపస్సు చేసి జ్ఞానాన్ని పొందారు.కాబట్టి ఈ దివ్యక్షేత్రంలో వెలసిన అమ్మవారు జ్ఞాన ప్రదాయని అని చెబుతారు.ఇక్కడ పక్కనే శయనమందిరం ఏర్పాటు చేశారు. ఇక్కడ భక్తులు సంతానం కోసం ఊయలలు, వివాహం కోసం గాజులు కడతారు. కార్యక్రమంలో ఆలయాధికారులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.ఆలయ ఇఓ పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.ఉత్సవాన్ని విజయంతం చేయటానికి భక్తులను కట్టడి చేయటానికి ఆలయంలోని అధికారులు నాగభూషణం, వెంకటముని, సుదర్శనం, హరియాదవ్, లోకేష్‌రెడ్డిలు పర్యవేక్షించారు.ఏర్పాట్లను ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్‌కృష్ణారెడ్డి పర్యవేక్షించారు.

# ఆ కార్పొరేటర్ల సంగతేంటో!?

### ఆరుగురు జనసేనలో చేరినా వేటువేయని వైసిపి -కూటమిలో సైకిలెక్కేందుకు ఇంకొందరు చూపు!!

ప్రభాతవార్త-తిరుపతి:

సరిగ్గా నెలరోజుల క్రిందట తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ రెండో డిప్యూటీ మేయర్‌కు జరిగిన ఎన్నికల్లో ఒకేఒక్కడు టిడిపి కార్పొరేటర్‌కు మద్దతునిచ్చిన 24మంది వైసిపికార్పొరేటర్లలో ఆరుగురు జనసేనపార్టీ కండువా వేసుకోవడం తెలిసిందే. మిగిలిన 18మంది వైసిపి కార్పొరేటర్లలో కొందరు కూటమి పార్టీల్లోని సైకిల్ ఎక్కేందుకు (టిడిపి కండువా వేసుకోవడానికి)సిద్ధంగా ఉన్నారు. వారికి టిడిపి అధిష్టానం నుండి ఇప్పటికీ గ్రీన్‌సిగ్నల్ రాకపోవడంతో ఏమి చేయాలనేది దిక్కుతోచడంలేదు. 2021లో వైసిపి జెండాపై గెలిచిన మెజార్టీ కార్పొరేటర్లు గత ఎనిమిదినెలలుగా ఆ పార్టీతో పొసగలేక పక్కచూపులు చూస్తున్న సంగతి విదితమే. వీరందరినీ ఆ పార్టీ నేతలు పొమ్మనలేకపొగబెట్టారా?లేక టిడిఆర్ బాండ్లలో జరిగిన అక్రమాలు,అవినీతి మరకలు అంటుకోకుండా జాగ్రత్తపడుతున్నారా!? అనేది తిరుపతి నగర జనంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ విషయాలపై పూర్వ వైసిపి కార్పొరేటర్లు ఎవరూ కూడా బహిరంగంగా నోరుమెదపకపోవడం కూడా విశేషం. 47మంది తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో 24మంది వైసిపిని వీడి గత ఎనిమిదినెలలుగా స్వతంత్రులుగానే వ్యవహరిస్తున్నారు. గతనెల 5వతేదీ జరిగిన రెండో డిప్యూటీ మేయర్ ఎన్నికలో ఆ 24మంది టిడిపి కార్పొరేటర్‌కు మద్దతుగా నిలిచి ఓటేశారు కూడా. దీంతో విప్‌ను ధిక్కరించారనే ఆరోపణలపై నెలరోజుల క్రిందటే కార్పొరేటర్లు ప్రవళికరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తిరుత్తణి శైలజ, దూదికుమారి, రాధలను పార్టీనుండి బహిష్కరించడం జరిగిపోయింది. అప్పటికే భూమన కుటుంబానికి వీరవిధేయుడుగా ఉన్న ఎస్‌కె బాబు,, కుడితి సుబ్రమణ్యం, తిరుత్తణిశైలజ, దూదికుమారి ,నారాయణ, పొన్నాలచంద్ర రెండువారాల క్రిందట తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో జనసేన పార్టీ కండువా వేసేసుకున్నారు. మిగిలిన 18మంది కార్పొరేటర్ల పరిస్థితి ఆగమ్యగోచరంగానే మారింది. అయితే పార్టీ మారినా, మరో పార్టీ కండువావేసుకున్నా ఇప్పటికీ వైసిపి నుండి వారిని సస్పెండ్ చేయడంగానీ, బహిష్కరించినట్లుగానీ ఆ పార్టీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం కూడా జనంలో ఆసక్తికర చర్చకు దారితీసింది.



**-స్వతంత్రుల్లో సైకిలెక్కేదెవరు!?:**

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో వైసిపి గుర్తుపై గెలిచిన 47మందిలో 24మంది బయటకు వచ్చేయడం, కొందరు జనసేన పార్టీలో చేరిపోవడం జరిగింది. ఇంకొందరు అర్థికంగా, జనబలం ఉన్న కార్పొరేటర్లు ముద్రనారాయణ(తొలి డిప్యూటీ మేయర్)శేఖర్‌రెడ్డి, నరసింహాచారి, మునిరామిరెడ్డి, అన్నా అనితయాదవ్, అన్నా సంధ్య, అనిల్, పరదేశినరేంద్ర,ఇంకొందరు కార్పొరేటర్లు పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే వీరిలో ఇప్పటికే అన్నా కుటుంబానికి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు టిడిపితోనే కొనసాగుతున్నారు.వీరిలో ఒకరికి మేయర్ పదవిని కట్టబెడతామని కూటమి నేతలు హామీ ఇచ్చారనేది రాజకీయంగా బలంగా వినిపిస్తోంది. అయితే ఎక్కడా కనీస బలంలేని ఒకేఒక్క టిడిపి కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ అయినా ఆశ్చర్యంలేని విషయంలో మేయర్ పదవిని చేజిక్కించుకునేందుకు సునాయాసమేనని సైకిలెక్కేందుకు సిద్ధంగా ఉన్న కార్పొరేటర్ల నోట మాట వినిపిస్తుండటం కొసమెరుపు. అయితే ఎందరు పసుపుకండువాలేసుకుంటారనేది మాత్రం కాలమే నిర్ణయించాల్సి ఉంది. ఇంకా పట్టుమని 11నెలలు పాలనమాత్రమే కౌన్సిల్ కొనసాగుతుంది. ఆ తరువాత ఎన్నికలు తప్పవు. మరీ ఈ తక్కువకాలానికి నగరజనంలో చెడ్డపేరు తెచ్చుకునేందుకు కొందరు కార్పొరేటర్లు సుముఖత చూపడంలేదనే వార్తలు గుప్పుమంటున్నాయి. అయితే తిరుపతి వైపిసిలో తిరుగులేని నేతగా అన్నీ తానై చక్రంతిప్పిన పూర్వఎంఎల్ఏ, టిటిడి మాజీ ఛైర్మన్ ,ప్రస్తుత ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు భూమన కరుణాకరెడ్డి ,తిరుపతి సమన్వయనేత భూమన అభినయ్‌రెడ్డికి నమ్మినబంట్లుగా పెత్తనం చలాయించిన పలువురు కీలక కార్పొరేటర్లు కూటమిపంచన చేరడంమాత్రం పెద్ద మైనస్సే.

రోడ్డు ప్రమాదాల నివారణపై

## మరింత అవగాహన

### -రోడ్డుశక్తికౌన్సిల్ కేంద్రాల్లో వాహనదారులకు చైతన్యం
### -రవాణాశాఖజాయింట్ కమిషనర్ క్రిష్ణవేణి



తిరుపతి(రవాణ),ప్రభాతవార్త:

రోడ్డుప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు తీసుకునే దిశగా రవాణాశాఖ, పోలీసుశాఖ సమన్వయంతో పనిచేస్తుందని రవాణాశాఖ జాయింట్ కమిషనర్ బి.క్రిష్ణవేణి తెలిపారు. ఇందుకోసం రోడ్డుభద్రత మాసోత్సవాల్లో భాగంగా రాయలసీమలోని అన్ని జిల్లాల్లో రోడ్డు శక్తి కౌన్సిల్ కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నామన్నారు. తిరుపతి జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఆమె జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రిపాటి మురళీమోహన్‌తో కలసి ఎంవిఐలు, అసిస్టెంట్ ఎంవిఐలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రోడ్డుశక్తికౌన్సిల్ సభ్యుల ద్వారా రహదారి భద్రతపై విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నియమాలు పాటించకుండా ఉల్లంఘించే వాహనదారులపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమన్నారు. ఇలాంటి వారిని గుర్తించేందుకు శక్తికౌన్సిల్ ఉపయోగపడుతుందన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి వారికి మూడుగంటలు అవగాహన కల్పించనున్నామన్నారు. జాతీయ రహదారులపై వాహనచోదకులు వేగంగా వెళ్ళడం, నిబంధనలు ఉల్లంఘించడం జరిగితే సమీప పోలీసు స్టేషన్‌లలో శక్తికౌన్సిల్ సభ్యులు డ్రైవర్లకు చైతన్యం కలిగిస్తారన్నారు. రవాణాశాఖ పరిధిలో పలు కారణాలతో సీజ్‌చేసిన వాహనాలను వాహనయజమానులు తీసుకెళ్ళకుంటే రానున్న ఏప్రిల్‌నెలలో వేలంవేయనున్నామన్నారు. వాహనదారులు ట్యాక్స్‌చెల్లింపు, హెల్మెట్ ధారణ, సీటుబెల్టు పెట్టుకోవడం, పొల్యూషన్, ఆర్‌సి వంటి సర్టిఫికెట్లు కలిగివుండాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో పూర్తిగాకట్టడిచేయడానికి రోడ్డుశక్తిద్వారా అవగాహనకల్పిస్తామని జాయింట్‌కమిషనర్ తెలిపారు.

# కుమార్తె ప్రేమించి పెళ్లి చేసుకుందని 'పంచాయతీ'

### కుమార్తెతో సహా యువకుడు.. బంధువులపై తండ్రి కత్తితో దాడి !!

కుప్పం, మార్చి 5 ప్రభాతవార్త

తన కుమార్తె ఓ యువకుడ్ని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయంగా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహిస్తున్న సమయంలో ఆగ్రహం పట్టలేని ఓ తండ్రి తన కుమార్తెతో సహా యువకుడు మరో ఇద్దరిపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి పారిపోయిన సంఘటన బుధవారం కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహంకు కూతవేటుదూరంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం అగరం పంచాయతీ కొత్తపల్లికి చెందిన చంద్రశేఖర్ (25) అనే యువకుడు అదే గ్రామానికి చెందిన శివశ ంకర్ కుమార్తె కౌసల్య (20)ను ప్రేమించాడన్నారు. ఈనెల 2వతేది వీరిద్దరూ ఇళ్లనుంచి వెళ్లిపోయి ఈనెల 3వతేది తమిళనాడులోని యాలగిరి హిల్స్‌లో పెళ్లి చేసుకున్నారు. అయితే ఈ విషయంగా బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ చేపట్టాలని నిర్ణయించి అందరూ అక్కడకు చేరుకున్నారు. శివశంకర్ అతని భార్య తమ కుమార్తె కౌసల్యను ఇంటికి రమ్మని పిలిచారు. ఆమె అంగీకరించకపోవడంతో తండ్రి అయిన శివశంకర్ తనతో పాటుత తెచ్చుకున్న కత్తితో తన కుమార్తె కౌసల్య, యువకుడు చంద్రశేఖర్, పంచా యతీ పెద్ద సీతారామప్ప, చంద్రశేఖర్ మేనమామ రమేష్ తదితరులపై కత్తితో పొడవడంతో వారు తీవ్ర ంగా గాయపడ్డారు. అంతలోనే శివశ ంకర్ పరారయ్యాడు. బాధితుల్ని స్థానికులు సమీపంలోని బిఆర్‌డి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. అర్బన్ సిఐ శంకరయ్య సంఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటాం- ఎస్పీ**




ప్రేమ వివాహం చేసుకుందని కుమార్తె తో సహా ఆమె పెళ్లి చేసుకున్న యువకుడు, మరో ఇద్దరిపై కత్తితో దాడి చేసిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పేర్కొన్నారు. బుధవారం రాత్రి ఆయన నిందితుడు శివశంకర్ దాడిలో కత్తిపోట్లకు గురై కుప్పం బిఆర్‌డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కౌసల్య, చంద్రశేఖర్, రమేష్, సీతారామప్పలను పరామర్శించి సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబుకు సూచించారు. ఈసంఘటనలో పారిపోయిన యువతి తండ్రి శివశ ంకర్ గాలింపుకోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసినట్లు విలేకరులకు తెలిపారు. అంతకుముందు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కుప్పం డిఎస్పీ పార్థసారథి పాల్గొన్నారు.



కత్తిపోట్లకు గురైన కౌసల్య. ఇన్‌సెట్లో చంద్రశేఖర్

## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కులు: కలెక్టర్

చిత్తూరురూరల్, మార్చి 5 ప్రభాతవార్త:

ప్రభుత్వం ప్రతి నియోజకవర్గ పరిధిలో ఒక ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా వుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వున్న వారిని ఎంపిక చేసి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు పెంపుపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఆర్థిక పురోభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ దిశగా సంబంధిత అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రస్తుతం వున్న పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులను సమకూర్చడంలో భాగంగా వారి అవసరాలకు అనుగుణంగా అవసరమైన వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి అవకాశాల కల్పనకు జిల్లా పరిశ్రమల కేంద్రం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కలిసి పని చేయాలని ఆదేశించారు. ఇది వరకే పరిశ్రమల స్థాపన కోసం భూమి కేటాయింపులు చేసుకున్నవారు పరిశ్రమలు స్థాపించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు 544 కోట్ల రూపాయలతో 59,044 మందికి ఉపాధి కల్పించేలా 14,761 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఉదయం పోర్టల్ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. అలాగే సింగిల్ డెస్క్ పోర్టల్ కింద 29 జనవరి 2025 నుండి 04 మార్చి 2025 వరకు 78 దరఖాస్తులు స్వీకరించగా ఇందులో 61 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం వెంకటరెడ్డి, డిప్యుటీ చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్‌డిఎం హరీష్, జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూధన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఇ ఇస్మాయిల్, ఇతర

## ఎకో సెన్సిటివ్ జోన్... మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి



తిరుపతి కలెక్టరేట్, మార్చి 5 ప్రభాతవార్త ః

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నందు ఎకో సెన్సిటివ్ జోన్ కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. నేటి బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సలో జాయింట్ కలెక్టర్ సూళ్ళూరుపేట డివిజన్ డీఎఫ్‌వో వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ అధికారి హారికతో కలిసి నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం నందు ఎకో సెన్సిటివ్ జోన్ కోసం మాస్టర్ ప్లాన్ తయారీపై వివిధ శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి జోన్ ఆవశ్యతను గురించి సంబంధిత అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎఫ్‌వో నాగభూషణ్, సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ అండ్ డెవలప్‌మెంట్ రీజనల్ డైరెక్టర్ జయచంద్ర, సెక్రటరీ ఫర్ ఎన్విరాన్మెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ డైరెక్టర్ టి. ఆర్ వినోద్, ఎఫ్ఆర్‌వో సౌజన్య, జిల్లా పశుసంవర్తక శాఖ అధికారి రవికుమార్, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజు, జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, డీఆర్డీడీఏ పీడీ శోభన్ బాబు, దొరవారి సత్రం మండలం తహశీల్దార్ శైలాకుమార్, సంబంధిత శాఖాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెటర్నరీ వర్సిటీ దిగ్బంధం

### -హాస్టల్స్ మూసివేయడం పై భగ్గుమన్న జూడాలు

తిరుపతి విద్య మార్చి 5 ప్రభాత వార్త

రాష్ట్రంలో అన్ని విభాగాలలో పనిచేస్తున్న వైద్య విద్యార్థులతో సమానంగా తమకు న్యాయం చేసి గౌరవేతనం అందించాలంటూ గత 31రోజులుగా సమ్మె చేస్తున్న విద్యార్థులపై వర్సిటీ అధికారులు బెదిరింపులకు దిగుతూ హాస్టల్స్ ను మూసివేశారు.దీంతో ఆగ్రహించిన పశువైద్య విద్యార్థులు ఎస్వీ వెటర్నరీ వర్సిటీని అష్టదిగ్బంధం చేశారు.వర్సిటీలోకి అధికారులను,ఉద్యోగులను ప్రవేశించకుండా గేట్లకు తాళాలు వేసి నినాదాలతో హోరెత్తించారు.అధికారులు తీరుకు నిరసనగా విద్యార్థులు తమ లగేజీలను వర్సిటీ ప్రధాన గేట్ల వద్ద ఉంచి మేము ఎక్కడికి వెళ్లాలంటూ నిలదీశారు.అప్పటికే అక్కడికి చేరుకున్న వర్సిటీ అధికారులు విద్యార్థులను బెదిరిస్తూ సమ్మె విరమిస్తేగాని హాస్టల్స్ ను తెరవమంటూ హెచ్చరించారు.

**-వర్సిటీని చుట్టుముట్టిన పోలీసు బలగాలు**

వర్సిటీ వీసీ,అధికారులు హాస్టల్స్ ను మూసివేయడంతో వివాధాలు చెలరేగాయి.గౌరవవేతనం పెంచాలంటూ సమ్మె చేస్తున్న వెటర్నరీ జూడాలను భయభ్రాంతులను చేసేందుకు వర్సిటీ అధికారులు పోలీసులను రంగంలోనిదింపారు. వర్సిటీ ప్రధాన గేటు పైనుంచి సమ్మె చేస్తున్న విద్యార్థుల వద్దకు పోలీసులు చేరుకోవడంతో వర్సిటీలో భయానకవాతావరణం ఏర్పడింది. ఏం జరుగుతుందో అర్థంకాక మహిళా విద్యార్థులు వణికిపోయారు. విద్యార్థులను నెట్టుకుంటూ వర్సిటీలోకి పోలీసులు ప్రవేశించారు. దీంతో విద్యార్థులు పోలీసుల వ్యవహారశైలిపై మండిపడ్డారు.వర్సిటీ వీసీ చేతగానితనం బట్టబయలైందని విద్యార్థులు నినదిస్తూ గేటు వద్దబైటాయించారు.



**ఎట్టకేలకు తిరుచుకున్న హాస్టల్స్...సమ్మె యథాతథం**

వెటర్నరీ జూడాలతో వర్సిటీ అధికారులు,పోలీసులు జరిపిన సుదీర్ఘ చర్చల అనంతరం విద్యార్థుల వసతి గృహాలను తిరిగి ప్రారంభించేందుకు అధికారులు సముఖం వ్యక్తం చేశారు.దీంతో పశు వైద్య విద్యార్థులు వర్సిటీ దిగ్బంధం ప్రక్రియను విరమించుకున్నారు.కానీ గౌరవ వేతనాన్ని పెంచేంతవరకు సమ్మెను యధావిదంగా కొనసాగిస్తామని అధికారులతో తేల్చి చెప్పారు.

## ప్రాధమిక ఆరోగ్యకేంద్రానికి అనారోగ్యం ...

నాయుడుపేట మార్చి 5 ప్రభాతవార్త;




గొట్టిప్రోలు ప్రాధమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేసే డాక్టర్లు డ్యూటికి డుమ్మా కొట్టడంతో ఆగ్రామ ప్రజలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనారోగ్యం సోకిందని పలువురు వాపోతున్నారు.నాయుడుపేట మండలానికి గొట్టిప్రోలు ప్రాధమిక ఆరోగ్యకేంధ్రం మారుమూల ప్రాంతంలో ఉండటంతో ఆరోగ్యకేంద్రంలో పనిచేసే వైద్యసిబ్బంది,డాక్టర్లు సక్రమంగా డ్యూటిలకు రావడంలేదని ఆగ్రామ ప్రజలు వాపోతున్నారు.గొట్టిప్రోలు ప్రాధమిక ఆరోగ్యకేంద్రలో ఇద్దరు డాక్టర్లు పనిచేస్తున్నారు.అయితే మంగళవారం ఆరోగ్యకేంద్రానికి ఇద్దరు డాక్టర్లు డుమ్మా కొట్టడంతో జ్వరం,తలనొప్పి,వాంతులు,జలుబు తదితర రోగాలతో ప్రాధమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చిన చుటుపక్కల గ్రామాల ప్రజలకు డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో చేసేదేమిలేక చివరకు వెనుతిరిగి వెళ్ళారు.వారంలో మూడురోజులు కూడ డాక్టర్లు విధులకు రావడం లేదని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.అసలే మారుమూల గ్రామాలు కావడంతో విషసర్పాలు బెడద ఎక్కువగా ఉందన్నారు.గ్రామాల్లో పాము,తేలు, కుట్టినప్పుడు ఆరోగ్యకేంధ్రానికి వెళ్ళగా అక్కడ డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతూ నాయుడుపేటకు వెళ్ళాల్సివస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లావైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి గొట్టిప్రోలు ప్రాధమిక ఆరోగ్యకేంధ్రంలో పనిచేసే డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

## జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలించిన ఎంపీడీవో



వాకాడు, మార్చి 5 ప్రభాతవార్త : వాకాడు మండలం నిడిగుర్తి గ్రామ సచివాలయ పరిధిలోని గొల్లపాలెం గ్రామంలో బుధవారం ప్రభుత్వం చేపట్టిన పి4 సర్వే, హౌస్ టు హౌస్ జియోట్యాగింగ్ సర్వేను ఎంపీడీవో శ్రీనివాసులు పరిశీలించారు. నిడిగుర్తి గ్రామంలో ఉన్న సచివాలయాన్ని ఎంపీడీవో శ్రీనివాసులు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు, సచివాలయం సిబ్బందితో ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలకు అందుబాటులో ఉండి రానున్న ప్రభుత్వ పథకాలతో పాటు సంక్షేమ పథకాలు, పంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. అనంతరం హౌస్ టు హౌస్ జియో ట్యాగింగ్ సర్వేను ఎంపీడీవో పర్యవేక్షించి పలు సూచనలు సలహాలను అందజేశారు.

# గూడూరు డివిజన్

## మద్యం వద్దు అన్నందుకు భర్త ఆత్మహత్య!

కోట, మార్చి 5 ప్రభాతవార్త : పచ్చని కుటుంబంలో మద్యం చిచ్చు పెడుతుందని, డబ్బు ఒళ్లు గుల్లవుతుందని, మద్యం జోలికి వెళ్లవద్దని భార్య చెప్పినందుకు భర్త గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం కోటలో చోటుచేసుకుంది. ఎస్ఐ పవన్‌కుమార్ కథనం మేరకు శ్యామసుందర పురానికి చెందిన హరి (40) నిత్యం మద్యం సేవించేవాడు. తన భర్తను మద్యం తాగవద్దని భార్య చెప్పడంతో గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడాడు. స్థానికుల సమాచారం మేరకు హరిని నెల్లూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

## వైద్యాధికారులతో డిఎంఅండ్‌హెచ్‌ఓ సమీక్ష



కోట, మార్చి 5 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడు ఆరోగ్య ఉపకేంద్రంలో బుధవారం డిఎంఅండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్ వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సత్వరమే వైద్యం అందేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రతి వైద్యాధికారిపై ఉందన్నారు. ఇక్కడ వైద్యులు డాక్టర్ వెంకటరమణ ఉన్నత చదువుల కోసం వెళ్లే క్రమంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరమణను డిఎంఅండ్‌హెచ్ఓ బాలకృష్ణ నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ పద్మావతి, డాక్టర్ నాగరాజులు ఘనంగా సన్మానించారు.

## కుక్కల దాడిలో జింక మృతి!

కోట, మార్చి 5 ప్రభాతవార్త : కోట మండలం తిన్నెలపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మక్కకండ్రిగ గ్రామంలో బుధవారం ఓ జింక తాగునీటి కోసం రావడంతో కుక్కలు వెంటపడ్డాయి. ఆ మేరకు ఒక్కసారిగా కుక్కలు జింకపై దాడి చేయడంతో ఆ జింక అక్కడికక్కడే మృతిచెందింది. గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ జింకను పోస్టుమార్టం నిమిత్తం అధికారులు తీసుకెళ్లారు.

## వోకేషనల్ అవార్డులు బహుకరణ



గూడూరు, మార్చి 5 ప్రభాతవార్త : రోటరీ క్లబ్‌నకు రోటరీ డిస్ట్రిక్ట్ 3160 గవర్నర్ రోటేరియన్ సి.ఎ.సాధుగోపాలకృష్ణ అధికారిక పర్యటన సందర్భంగా మంగళవారం రాత్రి బొమ్మిరెడ్డి రోటరీ కన్వెన్షన్ సెంటర్ భవనంలో రోటరీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తమ విధులను సక్రమంగా ఉన్నతంగా నిర్వహించిన ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులకు పిడీజీ తారాచంద్ దుగార్ దాతృత్వంతో వోకేషనల్ అవార్డులు బహుకరించడమైనది మరియు పదిమంది ఇంజనీరింగ్ విద్యార్థులకు దోడ్ల రుక్మిణమ్మ రోటరీ స్కాలర్‌షిప్ ఇవ్వడమైనది, నూతన సభ్యులను రోటరీ క్లబ్ నందు డిస్ట్రిక్ట్ గవర్నర్ ద్వారా చేర్పించడమైనదన్నారు. డిస్ట్రిక్ట్ రొటారక్ట్ రెప్రజెంటేటివ్ సెక్రటరీ తేజా ద్వారా దువ్వూరి రమణమ్మ ఉమెన్స్ కాలేజీలో ఒక రోటారాక్టు క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సమక్షంలో ఏర్పాటు చేయడమైనది. ఈ సందర్భంగా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి ప్రసంగిస్తూ గవర్నర్ అధికారిక పర్యటనకు రావడం చాలా ఆనందంగా ఉందని వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డిస్ట్రిక్ట్ గవర్నర్ రోటేరియన్ సాధు గోపాలకృష్ణ ప్రసంగిస్తూ గూడూరు రోటరీ క్లబ్ ఆంధ్ర క్లబ్ లలో మొదటి స్థానంలో ఉందని, దానికి మీ సభ్యులందరి కృషి ఉందన్నారు. పీడీజీ సురేంద్ర ప్రసంగిస్తూ రోటరీలో మహిళలలకు ప్రాధాన్యత ఇచ్చి, మహిళా సభ్యులు ఎక్కువగా చేరేటట్లు సభ్యులందరూ చూడాలని తెలిపారు. పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ రోటేరియన్ దశరథరామిరెడ్డి ప్రసంగిస్తూ డిస్ట్రిక్ట్ గవర్నర్ మంచి మనిషని, గోప్ప విద్యార్హతలు వ్యక్తి అని అన్నారు. అనంతరం డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి దంపతుల చేతుల మీదుగా డిస్ట్రిక్ట్ గవర్నర్‌కు సన్మానం చేశారు. తదుపరి కార్యదర్శి రోటేరియన్ జి.జి.నాయుడు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంనకు రోటేరియన్స్, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు, రొటారక్టర్స్, విద్యార్థులు హాజరైయ్యారు.

## అంగన్వాడీ కేంద్రంలో ఈసిసిఈ డే కార్యక్రమం



గూడూరు, మార్చి 5 ప్రభాతవార్త : గూడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నరశింగరావు పేట సెక్టారు తూనికల ఆఫీసు నందు అంగన్‌వాడి కేంద్రం వద్ద ఈసిసిఈ డే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసిసిఈ సందర్భంగా పౌష్టికాహారం లోపంతో ఉన్న పిల్లల తల్లిదండ్రు లతో సమావేశం నిర్వహించారు. ఎదుగుదల పర్యవేక్షణ యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. సిబి ఈవెంట్‌లో భాగంగా గర్భవతి నమోదు చేసి తాంబులం ఇచ్చి పోషకాహార కిట్‌ను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ మెహబూబి, సూపర్‌వైజర్ హైమావతి, అంగన్వాడి కార్యకర్త అరుణ దేవి, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి



కోట, మార్చి 5 ప్రభాతవార్త : కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం పంచాయతీలో మంచినీటి సమస్యను తక్షణమే అధికారులు పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ సర్దార్ హుస్సేన్ కోరారు. బుధవారం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామంలో సాగరమాల రోడ్డు నిర్మాణం పనుల్లో భాగంగా మంచినీటి పైపులైన్లు దెబ్బతినడంతో కొన్నిరోజుల పాటు మంచినీటి సమస్య ఏర్పడింది. ఆ క్రమంలో నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి, సర్పంచ్ బందిల ప్రసన్నలు తాగునీటికి సమస్య ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. అధికారుల సమన్వయలోపం కారణంగా తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని అధికారులకు నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి వివరించారు. అధికారులు సమన్వయంతో మంచినీటి సమస్య పరిష్కరించాలని ఆయన సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ అరవింద్, సర్పంచ్ ప్రసన్న ఉన్నారు.

## అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు:రేంజర్





వెంకటగిరి, మార్చి 5 ప్రభాతవార్త : అటవీ శాఖ భూములు ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ రేంజర్ అధికారి పి లోకేష్ తెలిపారు. వెంకటగిరి అటవీ కార్యాలయంలో రేంజర్ విలేకరుల సమావేశం మాట్లాడుతూ దక్కిలి మండలం మోపూరు అటవీ శాఖ ప్రాంతంలో ఉన్న భూములను కొందరు అక్రమంగా ఆక్రమించారు అనేది తెలిపారు. సర్వే నంబర్1లో ఉన్న భూమి మొత్తం అటువై శాఖకు చెందిందని తెలిపారు. మే నెల 21వ తేదీ 2024వ సంవత్సరం రెవెన్యూ అటు విశాఖ వారు సర్వే చేయగా మొత్తం ఫారెస్ట్ ల్యాండ్ అని సర్వే నివేదిక ఇచ్చారనేది తెలిపారు. అటు విషక భూములు ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు వచ్చి అధికారులను ఇబ్బంది పెడుతున్నట్లు చెప్పారు. ఆందోళన చేస్తుంటే నాయకులను కూడా అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు. అటవీ శాఖ భూములు అటవీ శాఖ భూములను ఆక్రమించరాదని ఆయన సూచించారు.

## కొత్తపట్నంలో నేడు గ్రామసభ



కోట, మార్చి 5 ప్రభాతవార్త : కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో గురువారం మధ్యాహ్నం 1 గంటకు గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించనున్నట్లు తహశీల్దార్ కె.జయజయరావు చెప్పారు. బుధవారం ఆయన కోటలోని తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడు తూ చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సిబిఐసి) ప్రాజెక్టులో భాగమైన ప్రభుత్వ భూములు సాగులో ఉన్న వారికి జిఓ ఎంఎస్ నంబర్ 43 ప్రకారం 11-2-2025 నష్టపరహారం మంజూరు చేసి ఉన్నారని తెలిపారు. గ్రామసభలో ఆమోదం తెలిపి లబ్ధిదారుల జాబితాను ప్రకటించడం జరుగుతుం దన్నారు. జాబితాలో ఏమైనా ఆక్షేపణలు ఉంటే 7వ తేదీలోగా సబ్ కలెక్టర్ కార్యాలయంలో రాతపూర్వకంగా తగిన ఆధారాలతో అర్జీ రూపంలో తెలియ జేయాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## తడ మండలంలో సర్వేల మీద అధికారుల సమీక్ష



తడ, మార్చి 5 ప్రభాతవార్త : తడ మండలంలోని పలు సచివాలయాల్లో వివిధ సర్వేల మీద బుధవారం అధికారులు సమీక్ష నిర్వహించారు. గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం అధికారి నరసింహారెడ్డి మొదట స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన తడకండ్రిగలో జరుగుతున్న వర్క్ ఫ్రం హోం సర్వేను స్థానిక ఎంపిడిఓ విజయకుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నిరకాల సర్వేలపై కొన్ని సూచనలు అందజేశారు.

## అసంపూర్తిగా పంచాయతీ భవనాలు



వెంకటగిరి, మార్చి 5 ప్రభాతవార్త : మండలంలోని పంచాయతీ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఉపాధి పథకం నిధులతో ఈ భవనాలను నిర్మిస్తున్నారు. ఒక్క భవనానికి 25 లక్షలు మంజూరు చేశారు. అయితే భవనాల పనులు కొంతమేరకు కాంట్రాక్టర్ పూర్తి చేశారు. నిధులు రాకపోవడం వల్ల పనులను ఆపివేశారు. మండలంలోని పాపమాంబాపురం, పాలకొండ సత్రం గ్రామాల్లో అసంపూర్తిగా భవనాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు చర్య తీసుకుని భవనాలు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## నిత్యావసర వస్తువులు పంపిణి



గూడూరు, మార్చి 5 ప్రభాతవార్త : త్యాగరాజావీధిలోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసారు. దాతలుగా మన్నారపు ఉష, డేగ సుప్రియలు ఐదు వేల రూపాయిలు అందజేశారు. ఈ కార్యక్రమానికి డా.రోహిణమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఇంకా ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణు వందన, ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు తనూజ కార్యదర్శి అనితా సభ్యులు స్నేహలత, లక్ష్మిలు, ఇంకా రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడిపర్తి శ్రీధర్, పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాస ఆచారి పాల్గొన్నారు.

## ఆవిర్భావ దినోత్సవ వేడుకలు విజయవంతం చేద్దాం

**- నియోజకవర్గం పిఓసి కె.మోహన్**



గూడూరు, మార్చి 5 ప్రభాతవార్త : జనసేన పార్టీ ఆవిర్భావం నుండి అభివృద్ధి వరకు తోడు ఉన్న ప్రతి ఒక్కరు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు, నియోజకవర్గ పిఓసి కె.మోహన్‌లు పిలుపునిచ్చారు. జనసేన నాయకులు, గూడూరు నియోజక వర్గ జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జనసేన నేత చంద్రశేఖర్ రావు అధ్యక్షతన ముఖ్య నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ మార్చి 14న పిఠాపురం చిత్రాడలో జరగనున్న జనసేన 12వ ఆవిర్భావ సభ చరిత్రలో నిలిచిపో తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ ప్రధాన కార్యదర్శులు వంశీ కృష్ణ, కుమార్, కార్యదర్శులు ఉప్పు సాయికిరణ్, పెంచలయ్య, సుమన్, ప్రవీణ్, మురళి, శివ, భరత్, గురు, తేజ,రాజు, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడి నుంచి వచ్చిందో...

**- సెజ్ మార్గంలోని చెరువులో మహిళ మృతదేహం**
**- అనుమానాస్పద మృతిగా ప్రచారం**



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు- సెజ్ మార్గంలో చెరువులో పడి మృతిచెందిన మహిళ

తడ, మార్చి 5 ప్రభాతవార్త : తడ మండలం మాంబట్టు సెజ్ మార్గంలోని కొండూరు చెరువులో బుధవారం ఒక కుళ్లిపోయిన మహిళ శవాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు ఐదురోజుల క్రితం ఈ మహిళ చెరువులో మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. బుధవారం స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం శవాన్ని వెలికి తీశారు. సూళ్లూరుపేట సిఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో తడ ఎస్ఐ కొండప్ప నాయుడు, సిబ్బంది అక్కడ పడి ఉన్న కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మహిళ 25 సంవత్సరాల వయస్సు కలిగి ఉంటుందని, కొన్ని ఆనవాళ్లను బట్టి వివాహితగా భావిస్తున్నారు. శవం పడి ఉన్న చెరువు గట్టున ఒరిస్సా రాష్ట్రంలో కొనుగోలు చేసినట్లుగా కొన్ని దుస్తులు దొరికాయి. టూత్ పేస్ట్, బ్రష్, ఇతర కొన్ని మేకప్ సామగ్రి కూడా ఆ ప్రాంతంలో చిందరవందరగా పడి ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుర్తుతెలియని మహిళ కావడంతో ఈ ప్రాంతంలోని ఏదయినా పరిశ్రమలో పనిచేయడానికి వచ్చి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఇక్కడి ప్రైవేటు హాస్టళ్లలో కూడా పోలీసులు విచారించారు. అయితే ఎటువంటి ఆచూకీ దొరకలేదు. అనంతరం నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు వచ్చి శవాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. శవం బాగా కుళ్లిపోయిన కారణంగా సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పోలీసులే గ్రామపెద్దల సహకారంతో పంచనామా పూర్తి చేశారు. ఇటీవల పారిశ్రామికవాడల్లో పలుచోట్ల అనుమానాస్పద మృతి కేసులు ఎక్కువయ్యాయి. మహిళ మృతదేహం బుధవారం కలకలం రేపింది. అపాచీ మార్గంలో వెళ్లే వందలాది మంది కార్మికులు సంఘటన స్థలంలో గుమిగూడి ఇది హత్యగా అనుమానించారు. అయితే పూర్తి వివరాలు అందలేదు. మృతురాలి చేతి మీద ఇర్ఫాన్ లవ్ సింబల్ అనిత అని ఇంగ్లీష్‌లో రాసి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బట్టలు తదితర వస్తువుల ఆనవాళ్లను బట్టి ఒరిస్సా రాష్ట్రంలోని అదాన్‌పూర్ ప్రాంతానికి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. అయితే ఆ మహిళ ఇంతదూరం ఎందుకు వచ్చిందో ఎవరితో వచ్చింది అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. డిఎస్పీ చెంచుబాబు మీడియాతో మాట్లాడుతూ ఈ మహిళ మృతి తర్వాత పలు పరిశ్రమలు, ప్రైవేటు హాస్టళ్లలో దర్యాప్తు వేగవంతం చేసి కారణాలు వెలిసి తీస్తామని వెల్లడించారు.

## సబ్సీడి రుణాల అబ్దిదారులకు ఇంటర్వ్యూలు



నాయుడుపేట, మార్చి 5 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయంలో సబ్సీడి రుణాల లబ్దిదారులకు ఎంపిడిఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో బుధవారం బ్యాంక్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బిసికార్పోరేషన్ ద్వార నాయుడుపేట మండలానికి 26 యూనిట్లు రుణాలు మంజూరైనట్లు తెలియ జేశారు. నాయుడుపేట మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో సుమారు 219 లబ్దిదారులు సబ్సీడి రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో 134మంది లబ్దిదారులు ఇంటర్వ్యూలకు హజరైనట్లు ఆయన తెలియజేవారు.

## ఆరోగ్యకేంద్రాల్లో ఉపయోగపడని మందులు!

**శాసనసభలో సమస్యపై చర్చించిన సుధీర్‌రెడ్డి**



అసెంబ్లీలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి,మార్చి 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో రోగాలకు అవసరమైన మందులు కాకుండా పనికి రాని మందులను సరఫరా చేస్తూ నిరుపేదల ప్రాణాలతో చెలగాటమాడారని శాసనసభలో శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సమస్యను ప్రస్తావించారు. గురువారం శాసనసభలో సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ గత వైకాపా పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వ్యాపారకేంద్రాలుగా మారిందని వివరించారు. గత వైకాపా పాలనలో శాసనసభ్యుడు ప్రైవేటు మందుల కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని నిరుపేదల జీవితాలతో చెలగాటమాడారన్నారు. నేటికి ఈ పరిస్థితి కొనసాగుతుందన్నారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలోని ప్రాథమిక కేంద్రాలు మాఫీయా కేంద్రాలుగా మారిందన్నారు. గతంలో శాసనసభ్యుడు ప్రైవేటు మందుల కంపెనీల వారితో ఒప్పందం చేసుకొని అమ్ముడుపోని మందులను సరఫరా చేసి పేద ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతూ తమ జేబులు నింపుకున్నారని ధ్వజమెత్తారు. తాను గెలిచిన తరువాత నియోజక వర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల డాక్టర్లతో సమావేశం జరపగా వారు తమకు అందించిన సమాచారం బాధేసిందన్నారు. గతంలో ప్రైవేటు కంపెనీలు ఆరునెలలు కూడా కాలం లేని మందులను పంపిణి చేసారన్నారు. వాటిని వాడి వాడకుండా పారేసామన్నారు. ఇక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో కనీస సదుపాయాలు దేవుడెరుగు నిరుపేదల రోగాలను చెక్ చేయటానికి బిపి ఆపరేట్ లేదన్నారు. జ్వరాని చూడడానికి కనీసం జ్వరమాని లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో మందుల పరిస్థితి పరిశీలిం చాలని పాత కాంట్రాక్టర్లకు స్వస్తి చెప్పి నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన మందులను అందించాలని సంబంధిత శాఖమంత్రికి విన్నవించారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్ధి మృతి



పుత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త : పట్టణ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్ధి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. నేసనూరు పంచాయతీ గట్టు గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదములు మునికుమార్, రవిశేఖర్ అలియాస్ తేజ నారాయణవనం మండల పరిధిలో వున్న వేదవ్యాస డిగ్రీ కాలేజీలో చదువుతున్నారు. బుధవారం ఉదయం 9గంటలకు ఇద్దరు అన్నదమ్ములు ద్విచక్ర వాహనంపై కాలేజీకి వెళుతున్నారు. తమ గ్రామం నుంచి సరిగ్గా పుత్తూరు - చెన్నై జాతీయ రహదారి పైకి రాగానే ఎదురుగా రాంగ్ రూట్‌లో వస్తున్న ఒక ట్రాక్టర్ వీరి వాహనాన్ని ఢీకొంది. దాంతో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న వాహనం వెనుక కూర్చుని వున్న రవిశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న అన్న మునికుమార్ తీవ్ర గాయాలై తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తల్లితండ్రులకు వీరిద్దరే పిల్లలు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సిరికల్చర్ రైతులకు ప్రోత్సాహం అందించండి

**–శాశనసభలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి**



పలమనేరు,మార్చి 5 ప్రభాతవార్త: సిరికల్చర్ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని ఇచ్చి ఆదుకోవాలని శాశనసభలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కోరారు.బుధవారం అమరావతిలో జరిగిన శాశనసభలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ప్రసంగిస్తూ.2014 నుండి 2019 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం పట్టు రైతులను అన్ని విధాలా ప్రోత్సహించి ఆదుకుందన్నారు. అప్పట్లో షెడ్లు, యంత్రాలు,ఎరువులు,పురుగుల మందులను సబ్సిడీ ధరలకు అందించిందన్నారు.అయితే గత వైకాపా ప్రభుత్వం పట్టు రైతులను అన్ని విధాల విస్మరించిందన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు గడుస్తున్న తరుణంలో పట్టు రైతులకు పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్‌ను మంజూరు చేయించాలని ఆ రైతాంగం తరపున ప్రభుత్వనికి విజ్ఞప్తి చేశారు.

## ఆక్రమించి నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, మార్చి 5 ప్రభాతవార్త : నగరపాలక సంస్థ పరిధిలో ఎవరైనా చెరువులు, కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని పాన్ చెరువు, గణేష్ లేఔట్, సాయి విష్ణు లేఔట్, జన చైతన్య లేఔట్, అన్నమయ్య మార్గం రోడ్డు తదితర ప్రాంతాలను డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, హెల్త్, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముఖ్యంగా పాన్ చెరువులో అనధికార నిర్మాణాలు చేస్తున్నారని, పలు లే ఔట్లలో కాలువలు ఆక్రమించినట్లు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఈ ప్రాంతాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు వేస్తున్నారని వారిని గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. అలాగే నగరంలో పలు డ్రెయినేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ వాహనం వెళ్లేలా చూడాలని హెల్త్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, తుడా ఎస్.ఈ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి సేతు మాధవ్, డిసిపి మహాపాత్ర, ఏసిపిలు బాలాజీ, మూర్తి, డి.ఈ.రమణ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

## రథ, ఆశ్వవాహనాలపై ఊరేగిన కలియుగదైవం



శ్రీకాళహస్తిరూరల్,మార్చి 5 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం తొండమాన్ పురంలో వెలసిన టిటిడి ఆలయానికి సంబంధించిన శ్రీదేవి,భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం రథోత్సవంను భక్తజన సమూహంతో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం తండోపతండాలుగా తరలి వచ్చారు. ఆలయంలో చక్కగా అలంకరించి రథోత్సవంను నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంలో తన దివ్యదర్శనం ఇచ్చారు. ఉదయం నుంచి ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఆలయంలో బ్రహ్మోత్సవాలంటే చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు సంబరాలే. తిరుమల వెళ్ళలేని భక్తులు ఇటీవల కాలంలో తొండమాన్ పురానికి వెళుతున్నారు. ఇక్కడ స్వామి ప్రసన్న వదనుడుగా దర్శనమిస్తున్నారు. అయితే ఈ ఆలయం జాతీయ రహదారి పక్కనే ఉన్నా ఎందుకో టిటిడి ప్రచారంలో వెనుకబడ్డారు. బుధవారం స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవాల్లో అశ్వవాహనంలో దర్శనమిచ్చారు. ఉత్సవం ఆలయంలోని అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను చక్కగా అలంకారం జరిపి గ్రామోత్సవానికి సిద్ధం చేసి వాహనంలో ప్రతిష్టించారు. మేళ తాళాలు మంగళవాయిద్యాలు వేద పండితుల వేదమంత్రాలతో గ్రామోత్సవం సాగింది. ఉత్సవంతో పాటు అర్చకులు రమణాచార్యులు, బాబు,కృష్ణ,జయకుమార్, గోపి, మాధవా చార్యులు తదితరులు పాల్గొన్నారు. సూపరింటెండెంట్ జ్ఞాన ప్రకాష్, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్‌రెడ్డి, కందాటి శేఖర్‌రెడ్డి సర్పంచ్ బ్రహేమభూషణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మద్యం షాపు వద్దనే ధర్నాలో విద్యార్థులు

తిరుపతిరూరల్, మార్చి 5 ప్రభాతవార్త: సమాజం హర్షించని విధి విధానాలను ప్రభుత్వమే స్వాగతించి, అమలు చేసే తరుణంలో స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు అడ్డుతగిలి పోరాటం చేస్తే సమాజంలోని ప్రజలందరూ హర్షించి స్వాగతం పలుకుతారు. ఎవరి స్వార్థం కోసం అభం శుభం తెలియని విద్యార్థులను రోడ్డులో కూర్చోబెట్టి ధర్నా చేయించడంపై ఎంతవరకు సబబు అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక పక్క కాలుతున్న రోడ్డు, మరో పక్క ఎర్రటి ఎండ... ఎందుకోసం...ఎవరి స్వాలాభం కోసం ధర్నా చేస్తున్నామో తెలియని అమాయకత్వం...వెరసి నడిరోడ్డుపై విద్యార్థులను కూర్చోబెట్టి నినాదాలు చేయించడం వెనక అంతర్యం ఎమిటి. ఎందుకు విద్యార్థులను ధర్నాకు ఎందుకు పంపారో ఆయా విద్యా సంస్థలకే ఎరుక. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు స్కూల్‌కు వెళ్ళి విద్యానభ్యసిస్తున్నారని భ్రమలో ఉంటే స్కూల్ యజమాన్యాలు ఇలా రోడ్డుపై కూర్చోబెట్టి ధర్నా చేయించడంపై జిల్లా విద్యాధికారులు స్పందించి సంబంధిత స్కూల్స్ విచారణ జరపాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

## చౌడేపల్లి బస్టాండులో విష సర్పాలు

చౌడేపల్లి, మార్చి 5 ప్రభాతవార్త : బస్సు కోసం ప్రయాణీకులు వేచివుండగా ఎక్కడి నుంచి వస్తున్నాయో తెలియదు కానీ విష సర్పాలు బస్టాండులో ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో ప్రయాణీకులు, స్థానికంగా వున్న దుకాణదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు. బస్టాండులోని తిరుపతి వైపు వెళ్ళే బస్సుల కోసం రోడ్డుపక్కనే ప్రయాణీకులు వేచివున్న సమయంలో భూమిలోంచి చిన్న చిన్న విష సర్పాలు బయటకు వస్తున్నాయి. దీంతో ప్రజలు పరుగులు తీస్తున్నారు. వేసవి తీవ్రతకు కాలువల్లోంచి విష సర్పాలు జనావాసంలోకి వస్తున్నాయి. సంబంధిత అధికారులు వాటి బారి నుంచి ప్రయాణీకులు, స్థానిక దుకాణదారులను రక్షించాలని కోరుతున్నారు.